క్లుప్తంగా

సర్వేకు అనుమతులు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రొద్దం: సాగుదారుల హద్దుల మేరకు సర్వేకు అనుమతులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కోగిర రెవెన్యూ భూముల్లో సర్వేనంబర్ 669లో సుమారు 150 మంది రైతులు భూమి లేని గిరిజన, దళితులు ఉన్నారని పేర్కొన్నారు. దాదాపు 20 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో 500 ఎకరాలు సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. సాగుదారుల హద్దుల మేరకు భూమి సర్వేకు అనుమతించాలని కోరారు. పలు డిమాండ్లతో తహసీల్దార్ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ఈనెల 11న సర్వేకు ఆరు టీములు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉన్నాతాధికారులు నివేదికలు పంపి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, రైతు సంఘం ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లగోరి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న లగోరీ క్రీడాకారులు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి లగోరి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారని జిల్లా లగోరి అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బంగారు చంద్ర, కోచ్‌లు శైలజ, సాయి స్వరూప్, ఇర్ఫాన్ తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌లో ఆదివారం రాత్రి వరకూ రాష్ట్రస్థాయి లగోరి బాలికల అండర్–17 పోటీలు జరిగాయన్నారు. జిల్లా నుంచి రాజేశ్వరి, జాహ్నవి, నవ్యశ్రీ, మోక్షిత, లిఖిత, అయేషా, ప్రియాంక, నిఖిత, దీక్ష, హారిక, సాహిత్య, చంద్రకళ, తనిష్తరెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. త్వరలో ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

యూటీఎఫ్ నాయకుల సంబరాలు



అంబేడ్కర్ సర్కిల్లో సంబరాల్లో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండరూరల్: పీడీఎఫ్ ఎమ్మెల్సీగా బొర్రా గోపి మూర్తి విజయం యూటీఎఫ్ పోరాటాలకు నిదర్శనమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఎమ్మెల్సీగా గోపీమూర్తి విజయం సాధించడంతో యూటీఎఫ్ నాయకులు అంబేడ్కర్ సర్కిల్లో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అంతకు ముందు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. నాయకులు నారాయణస్వామి, కృష్ణా నాయక్, నబి, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్ సంపత్‌కు ఘన నివాళి



అన్నదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఎస్ఎస్‌యూఐ మాజీ జాతీయ కార్యదర్శి దివంగత రాజ్ సంపత్ 31వ జయంతి వేడుకలను మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాజ్ సంపత్ మిత్ర బృందం మాట్లాడుతూ సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించి విద్యార్థి సంఘం జాతీయ నాయకుడిగా, న్యాయవాదిగా ఎదిగిన రాజ్ సంపత్ ఇటీవల దారుణ హత్యకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. రాజ్ సంపత్ చేసిన సేవలను గుర్తు చేస్తున్నారు.

బీమాపై అవగాహన

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు బీమా చేయించుకుని ధీమగా ఉండాలని కర్నూల్ కెనరా బ్యాంకు కళాజాత బృందం సభ్యులు మహేష్, రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తమ్మడేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కెనరా బ్యాంకు మేనేజర్ బాబు ప్రసాద్ బేరా ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర , మహేష్ పాటలు, నృత్యంతో బ్యాంకులో ఉన్న సదుపాయాలు, బీమాపై అవగాహన కల్పించారు.

టమాట రైతులకు ఉత్తరం దెబ్బ



లాలేపల్లి సమీపంలో సాగు చేసిన టమాట పంట

- నార్త్ ఇండియా నుంచి వస్తున్న సరుకుతో ధరల ధమాల్
- 15 కేజీల బాక్సు రూ.500 నుంచి రూ.100కు పడిపోయిన వైనం
- రవాణా చార్జీలు కూడా రావని తోటల్లోనే వదిలేస్తున్న రైతులు



చిలమత్తూరు: ఉత్తర భారత దేశం నుంచి దిగుమతి అవుతున్న టమాట సరుకుతో మన రైతులు నష్టాల బాట పట్టారు. పెట్టుబడి అయినా పొందుతామని ఎదురుచూసిన రైతులు ఒక్కసారిగా ధరలు కుప్పకూలడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.1.50 లక్షల దాకా ఖర్చు

ఎకరా భూమిలో టమాట పంట సాగు చేస్తే పంట కోత దశ వరకూ రూ. లక్ష నుంచి 1.5 లక్షల దాకా ఖర్చు వస్తోంది. వాతావరణ మార్పులు కారణంగా పంటలను కాపాడుకునేందుకు రైతులు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అరకొరగా వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముదామనుకున్న రైతులకు షాక్ తగిలింది. టమాట ధరలు అమాంతం పతనం కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. సత్యసాయి జిల్లా రైతులు ఎక్కువగా బాగేపల్లి, చింతామణి, కోలారు, బెంగళూరు, అనంతపురం, మదనపల్లి, మొలకలచెరువు తదితర మార్కెట్లకు సరుకును తరలిస్తుంటారు. గత నెలరోజులుగా ధరలు ఆశించిన స్థాయిలోనే ఉన్నాయి. టమాట 15 కేజీల బాక్స్ ధర రూ. 500, 600 పలకగా నేడు రూ.100 నుంచి రూ.150కు పడిపోయాయి. రెండు రోజుల వ్యవధిలోనే ధరలు ఇలా పతనం కావడంతో అన్నదాతలకు ఏం చేయాలో కూడా దిక్కుతోచడం లేదు. స్థిరంగా ఉన్న ధరలు వచ్చే సంక్రాంతి వరకూ కొనసాగుతాయని అంచనా వేశారు. ధరలు పడిపోవడంతో పంట పెట్టుబడికి మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు లబోదిబోమంటున్నారు.

ఒక్కో మార్కెట్లో ఒక్కో రేటు

మంచు ప్రభావంతో దిగుబడులు తక్కువగా ఉన్నా ఫెంగల్ తుఫాను తర్వాత కాస్తున్న ఎండల కారణంగా టమాట కాయలు ఎక్కువగా మాగుతుండటంతో మార్కెట్‌లకు దిగుబడి పెరిగింది. ఒక మార్కెట్‌లో ఉన్న ధర మరో మార్కెట్‌లో ఉండకపోతుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, మడకశిర నియోజకవర్గాల్లో టమాట సాగు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కదిరి నియోజకవర్గానికి మదనపల్లి, మొలకలచెరువు మార్కెట్‌లు దగ్గరగా ఉండగా, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాలకు చెందిన రైతులు బాగేపల్లి, చింతామణి మార్కెట్‌లకు టమాటను తరలిస్తున్నారు.

వ్యాపారస్తుల తీరుతో ..

టమాట ఎక్కువగా సాగుచేసే ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల రైతులకు వ్యాపారస్తుల తీరు శాపంగా మారింది. స్థానికంగా ధరలు స్థిరంగా ఉంటే తమ ఆదాయాల కోసం ఉత్తర భారత దేశంలోని చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి టమాట దిగుమతి చేసుకొని వేలంలో ఉంచుతుండటంతో ధరలు పతనమై స్థానిక రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇకనైనా స్థానిక రైతులకు వ్యాపారస్తులు సహకరించాల్సిన అవసరం ఉందని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

టమాట సాగు ఇలా...

నియోజకవర్గం	సాగు చేసిన ఎకరాలు
హిందూపురం	950
పెనుకొండ	405
మడకశిర	335



కర్ణాటకలోని బాగేపల్లి మార్కెట్‌లో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

పెట్టుబడి కూడా కష్టమే



టమాట పంట అర ఎకరాలో సాగు చేశాను. రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను. 15 కేజీల బాక్స్ ధర ఇన్ని రోజులు రూ.300 – 400 మధ్య పలికింది. ఏమైందో తెలీదు ఒక్కరోజు వ్యవధిలోనే రూ.100 లోపు వచ్చాయి. వర్షాలకు పంటను కాపాడుకోవడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. అయినా ధరలు పతనం కావడంతో దిగాలుగా ఉంది. ధరలు పెరిగితేనే పెట్టుబడి అయినా దక్కుతుంది.

– బి.కృష్ణారెడ్డి, మరవకొత్తపల్లి

బయటి రాష్ట్రాల దిగుమతులతోనే..



స్థానికంగా పంటల సాగు పెరిగింది. మూడు రోజుల క్రితం వరకూ టమాట ధరలు స్థిరంగానే ఉన్నాయి. సంక్రాంతి పండుగ దాకా ధరలు కొనసాగుతాయని కూడా రైతులకు చెప్పాం. కానీ ఉత్తర భారత దేశం నుంచి దిగుమతులు పెరగడంతో ధరలు పతనం అవుతున్నాయి. మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉంది.

– శ్రీకాంత్‌రెడ్డి, టీఎస్ఆర్ మండి, బాగేపల్లి మార్కెట్

నేడు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీచరణ్ మంగళవారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



మాట్లాడుతున్న సీఐ రాజ్‌కుమార్

మడకశిర రూరల్: మత్తు పదార్థాల జోలికి విద్యార్థులెవరూ వెళ్లకూడదని సీఐ రాజ్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని ఏఆర్ రొప్పం ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాను వివరించారు. కార్యక్రమంలో భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెజ్ భూములు తిరిగివ్వాలి

పరిగి: మండలంలో సెజ్‌ల ఏర్పాటు కోసం సేకరించిన భూములను ప్రభుత్వం వెంటనే బాధిత నిర్వాసిత రైతులకు తిరిగి ఇవ్వాలని రైతులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దారు హసీనా సుల్తానాకు వినతిపత్రాన్ని అందించారు. 2006–2009 సంవత్సరం వరకూ పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి, ధనాపురం, హొన్నంపల్లి పరిగి పంచాయతీ గ్రామాల్లో అప్పటి ప్రభుత్వం సెజ్‌ల పేరుతో వందలాది ఎకరాలను సేకరించిందన్నారు. నేటికీ పరిశ్రమలు నిర్మించని కారణంగా వెంటనే భూములు వెనక్కి ఇవ్వాలని రైతులు రామాంజి, బ్రహ్మయ్య, రామకృష్ణ విన్నవించారు.

సమ్మెలోకి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

హిందూపురం టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న నీటి సరఫరా, లైటింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో నాయకులు మాట్లాడుతూ టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ 24,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏడాదికి 72 రోజులు సెలవులు లేదా వేతన పని దినాలుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రఘు, కోటేశ్వర్, బాబా, కగ్గల్లప్ప, అంజి, క్రిష్ణ, శీన, జనార్దన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: హిందూపురం అర్బన్ మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలోని మున్సిపల్ అజీజియా ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్ బిల్లులు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ మొదలగునవి వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ

సోమందేపల్లి: మండలంలోని నల్ల గొంద్రాయనపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీని హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే లారీ డివైడర్ దాటి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో డ్రైవర్ గోరక్ మోటోకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పింఛన్ల తనిఖీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామ సచివాలయం -1 పరిధిలోని ఆమిదాలగొంది, హెచ్‌ఆర్ పాళ్యం, టీడీపల్లి గ్రామాల్లో సోమవారం మూడు బృందాల అధికారుల పింఛన్లను తనిఖీ చేశారు. అమరాపురం ఎంపీడీఓ రామారావు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్‌కు అర్హత ఉందో లేదో తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పర్యవేక్షించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలో ఎక్కడైనా సరే ఉపాధి పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. పట్టణంలోని జీవనోపాధుల కేంద్రంలో సోమవారం ఆయన ఏపీఓలు, టీఏలు తదితర ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు చేశారు. భక్తులు, పర్యాటకులు స్వామివార్లను దర్శించుకున్నారు.



చిత్రలింగేశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం

చిత్రలింగేశ్వరుడికి పూజలు

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ఎస్ గుండ్లు గ్రామంలో గొల్లరహట్టి పొలిమేరలో వెలసిన చిత్రలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: 'కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తి క్షీణించాయి. ముఖ్యంగా రాష్ట్రంలో మహిళలు, బాలికలకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయి. శాంతి భద్రతలను పరిరక్షించడంలో హోంమంత్రి అనిత పూర్తిగా విఫలం అయ్యారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని వానవోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఏర్పాటు చేశారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో పాటు ప్రజలను పక్కదారి పట్టించేందుకు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, కూటమి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సిద్ధమయ్యారని, అందుకు ప్రతి కార్యకర్త సన్నద్ధమవ్వాలన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుదన్నారు. అనంతరం వానవోలు, వానవోలు తండా పంచాయితీలకు సంబంధించి బూత్ కమిటీ కన్వీనర్లను ఎన్నుకున్నారు. వానవోలు పంచాయతీ బూత్ కమిటీ కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్, వానవోలు తండా కన్వీనర్‌గా వెంకటేశునాయక్‌ను ఎన్నుకున్నారు. వారితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, టౌన్ కన్వీనర్ మేదర శంకర, నాయకులు రఘురామిరెడ్డి, గంపల వెంకటరమణరెడ్డి, బూదిలి శ్రీనివాసరెడ్డి, బాలన్నగారిపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పరిగి: మండలంలోని మోదా గ్రామ పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మోహన్ తండ్రి నంజుండప్ప సోమవారం అనారోగ్యం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సోమవారం ఉదయం మోదాకు వెళ్లి నంజుండప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దాసరిపల్లిలో జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి అవ్వ గౌరమ్మ మృతి చెందారు. గౌరమ్మ మృతదేహం వద్ద ఉషశ్రీచరణ్ నివాళులర్పించారు. బసవనపల్లిలో అనారోగ్యంతో చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డిని పరామర్శించారు. తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న ఊటుకూరులో ఫయాజ్, అక్కంపల్లి సుబ్బరాయుడులను పరామర్శించారు. మండల కన్వీనర్ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

అగళి: మండల పరిధిలోని ఆలుడి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ భాస్కర్ సోమవారం తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు అక్కడికి చేరుకొని ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓను కోరారు. ఆరుగురు ఉపాధ్యాయులు ఉండగా అందులో ఇద్దరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారన్నారు. 6, 7 తరగతి విద్యార్థులకు సబ్జెక్ట్ పరంగా ఉపాధ్యాయులు నియమించాలని కోరారు. త్వరలోనే ఉపాధ్యాయులను నియమిస్తామని ఎంఈఓ హామీ ఇచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజ కుల్లాయప్ప తెలిపారు. జంబులబండ గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురుని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. 7150 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా పేకాటస్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు.

సంక్షిప్త సమాచారం

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన శివయ్య

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం బోల్తాపడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాలు మేరకు.. రామగిరి మండలానికి చెందిన శివయ్య పని నిమిత్తం పెనుకొండ వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో హరిపురం సమీపంలో అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన శివయ్యను స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న ఐచర్

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద చెట్టును ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హిందూపురం వైపు వెళుతున్న ఐచర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ఇతర వాహనదారులు అతన్ని రక్షించారు. చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకోండి

రొళ్ల: పిల్లల చదువుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని మారుతి కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరి ప్రాథమికోన్నత పాఠశాలను కూడా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: విజయవాడలో ఈ నెల 19న జరిగే శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఐటీయూసీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహాసభకు హిందూపురం నుంచి శానిటేషన్ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ రాయాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శాంతలక్ష్మీ మాట్లాడుతూ బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే జరుగుతాయని, బాల్య వివాహాలు లేని మండలంగా గుడిబండను తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామమూర్తి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు



ప్రమాదానికి గురైన కారును క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకొంది. పెనుకొండ నుంచి అనంతపురం వెళ్తున్న కారు గుట్టూరు కనుమ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.